

దిక్కుతోచని 'ఐపీజీ' బాధితులు

ఐపీజీ(ఇంటర్ పబ్లిక్ గ్రూప్) రెంట్ యాప్‌లో పెట్టుబడి పెట్టిన బాధితులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. - 8లో



జోడో యాత్రకు బ్రేక్

మిర్యాలగూడ నియోజకవర్గంలో బత్తుల లక్ష్మారెడ్డి చేపట్టిన హాథ్‌సే హాథ్ జోడో యాత్రకు బ్రేక్ పడింది. - 8లో

గరిష్టం/కనిష్టం
39°/23°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

స్వేచ్ఛ ఈ సేవ కేంద్రాల ఏర్పాటు

నల్లగొండ రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ సేవలు అందించేందుకు స్వేచ్ఛ ఈ–సేవ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు స్వేచ్ఛ ఈ–సేవ సీఈఓ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వేచ్ఛ ఈ సేవ కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలను ఆన్‌లైన్ ద్వారా అందించవచ్చని పేర్కొన్నారు. వీటి వల్ల నిరుద్యోగులకు ఉపాధి, ప్రజలకు సేవలు అందుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 91542 52555 ఫోన్‌నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

న్యాక్‌తో ప్రపంచస్థాయి గుర్తింపు



మాట్లాడుతున్న రాష్ట్ర కో–ఆర్డినేటర్ ధర్మానాయక్

నల్లగొండ రూరల్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి న్యాక్‌లో ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తుందని పూర్వ విద్యార్థుల సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ ధర్మానాయక్ తెలిపారు. ఆదివారం స్థానిక దూర విద్యాకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాక్ పరిశీలన తర్వాత కొత్త కోర్సులను ప్రారంభిస్తామని చెప్పారు. త్వరలోనే పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా పూర్వ విద్యార్థుల అధ్యక్షుడిగా నరదాస్ సైదబాబును, సభ్యులుగా శివకుమార్, వెంకట్, జిల్లా యాదయ్యను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో దూరవిద్య కో–ఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే అభివృద్ధి



నడిగడ్డలో మాట్లాడుతున్న కేతావత్ శంకర్‌నాయక్

అడవిదేవులపల్లి : కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఆదివారం రాత్రి మండలంలోని నడిగడ్డ గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధే ప్రస్తుతం ఉందని.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగింది శూన్యమన్నారు. అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని బీఆర్ఎస్ మోసం చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1200కు పెంచి పేదల నడ్డి విరిచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాల నరసింహ, రమావత్ నాగునాయక్, దాసు, రాముయాదవ్ తదితరులున్నారు.

నేడు పోచంపల్లి నుంచి 'భూమి కారవాన్-2 యాత్ర'

భూదాన్‌పోచంపల్లి : భూమి హక్కులు, భూ పరిపాలన, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు సోమవారం ఉదయం భూదాన్‌పోచంపల్లిలోని వినోబాభావే మందిరం నుంచి భూమి కారవాన్ – 2 యాత్ర చేపట్టనున్నామని లీఫ్ (లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్ సొసైటీ) సంస్థ ఉపాధ్యక్షుడు జి.జీవన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాదయాత్ర భూదాన్‌పోచంపల్లి నుంచి దోతిగూడెం మీదుగా చౌటుప్పల్, గుడిమల్కాపూర్, సంస్థాన్‌నారాయణపురం, పుట్టపాక, మునుగోడు, చండూర్, నాంపల్లి, పసునూరు, మల్లేపల్లి వరకు కొనసాగుతుందన్నారు. రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇతర జిల్లాల ధాన్యం తేవొద్దని..

- రెండో రోజూ ధాన్యం లారీలను జిల్లాలోకి అనుమతించని పోలీసులు
- చిల్లేపల్లి బ్రిడ్జి వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు
- పోలీసులతో లారీ డ్రైవర్ల వాగ్వాదం
- ధాన్యం పాడవుతుందని రైతుల ఆందోళన
- ఆలగడప చెక్‌పోస్ట్ వద్ద ఉద్రిక్తత



మిర్యాలగూడ మండలం ఆలగడప చెక్‌పోస్టు వద్ద నిలిచిన ధాన్యం లారీలు

మిర్యాలగూడ, నేరేడుచర్ల : ధాన్యం విక్రయానికి ఇతర జిల్లాల నుంచి నల్లగొండ జిల్లాలోకి వస్తున్న లారీలను పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు రెండో రోజూ ఆదివారం కూడా అనుమతించలేదు. రైతుల ముసుగులో ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతం కోదాడ, మఠంపల్లి నుంచి మిర్యాలగూడ రైస్ మిల్లులకు ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని ఆలగడప టోల్ గేట్ వద్ద చెక్‌పోస్టు బృందాలు అడ్డుకోవడంతో లారీలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. దీంతో రెండు రోజులుగా పడిగాపులుగాస్తున్న రైతులు, లారీ డ్రైవర్లు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ధాన్యం పచ్చివి కావడంతో పాడయ్యే ప్రమాదం ఉందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వరి కోతలు ప్రారంభానికి ముందే అంతర్ జిల్లాల రైతులు నల్లగొండ జిల్లాకు ధాన్యాన్ని తీసుకురావద్దని ప్రకటిస్తే ఈ సమస్య ఉండేది కాదన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా లారీలను ఎలా నిలుపుదల చేస్తారని పోలీసులను నిలదీశారు. మాది కూడా తెలంగాణ రాష్ట్రమేనని, సూర్యాపేట జిల్లా రైతులను నల్లగొండ జిల్లాలోని మిల్లుల్లో అమ్ముకునేందుకు ఎందుకు అనుమతించడం లేదని చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన పలువురు రైతులు ప్రశ్నించారు.

మూడు కిలోమీటర్ల వరకు..

తెలంగాణలోని అంతర్ జిల్లాలతో పాటు పక్క రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్ నుంచి ధాన్యం లారీలు మిర్యాలగూడ మిల్లులకు భారీగా తరలివస్తున్నాయి. దీంతో మిర్యాలగూడలోని మిల్లర్లు స్థానికుల ధాన్యానికి ధరలు తగ్గించడంతో ఇతర జిల్లాల నుంచి వచ్చే ధాన్యాన్ని నిలుపుదల చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాల ఇచ్చారు. వారి ఆదేశాల మేరకు చిల్లేపల్లి టోల్‌గేట్ వద్ద ధాన్యం లారీలను మిర్యాలగూడ రూరల్ పోలీసులు నిలిపివేశారు. దీంతో టోల్‌గేటు నుంచి చిల్లేపల్లి చెరువు అలుగు వరకు సుమారు మూడు కిలో మీటర్ల మేరకు ధాన్యం లారీలు నిలిచిపోయాయి. ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చే ధాన్యాన్ని మాత్రం పోలీసులు



చెక్‌పోస్టు వద్ద లారీలను అడ్డుకుంటున్న పోలీసులు

అనుమతిస్తున్నారు. కాగా, నేరేడుచర్ల, మిర్యాలగూడ పోలీసులు సమన్వయంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా లారీలు రోడ్డుకు ఒక వైపు మాత్రమే నిలిపే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

మిల్లర్లు సిండికేట్ అయ్యారని..

ఆంధ్రా నుంచి వస్తున్న ధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని మిల్లర్లు సిండికేట్‌గా మారి ధాన్యం క్వింటా ధరను రూ.2 వేల నుంచి రూ. 2100 వరకు తగ్గించారు. దీంతో నల్లగొండ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు జిల్లా సరిహద్దులైన వాడపల్లి, నాగార్జునసాగర్, ఆలగడప టోల్‌గేటు వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీసు, పౌరసరఫరా, వ్యవసాయ శాఖ సిబ్బందిని మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

ముందస్తు కొనుగోళ్లు!

- ఈ మేరకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరనున్న అధికారులు
- ధాన్యం కొనుగోళ్లపై నేడు మంత్రులు, ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్
- ప్రభుత్వం ఓకే అంటే 11వ తేదీన కొనుగోలు కేంద్రాల ప్రారంభం



మిర్యాలగూడ మార్కెట్‌లో ధాన్యం రాశులు

నల్లగొండ : జిల్లాలో వరి కోతలు ప్రారంభమై 15 రోజులు కావస్తోంది. రైతులు ధాన్యం తెచ్చి కల్లాల్లో పోస్తున్నారు. కానీ, ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో మిల్లర్లను ఆశ్రయించడంతో వారు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. దీంతో అధికారులు జిల్లాలో ముందస్తు ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలని భావిస్తున్నారు. సోమవారం మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ముందుగా కొనుగోళ్లు ప్రారంభించేందుకు అనుమతి తీసుకోవాలని జిల్లా అధికారులు నిర్ణయించుకున్నారు. అందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తే ఈనెల 11 నుంచి కొనుగోళ్లను ప్రారంభించే అవకాశం ఉంది.

15 రోజుల కిందటే కోతలు ప్రారంభం..

జిల్లాలో ఆయకట్టు పరిధిలో వరి నాట్లు ఆలస్యంగా ప్రారంభమవుతాయి. నాన్ ఆయకట్టులో, ఏఎమ్మార్పీ పరిధిలోని చెరువులు, బోరుబావుల కింద వరి సాగు ముందుగానే ప్రారంభిస్తారు. దీంతో నాన్ ఆయకట్టులో వరి కోతలు 15 రోజుల క్రితమే ప్రారంభమయ్యాయి. ఇప్పటికే పెద్ద ఎత్తున రైతులు వరి కోసి ధాన్యం కల్లాల్లో పోసుకున్నారు. ప్రభుత్వం ఈనెల 20వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభించే అవకాశం ఉండటంతో ముందు వరి కోసిన రైతులు అంతా ధాన్యాన్ని నిల్వ చేసుకోలేక అమ్ముకునేందుకు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో క్వింటాకు మద్దతు ధర రూ.2060 ఉండగా.. రూ.1700లకే మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు.

రేపటి నుంచి కొనుగోళ్లు !

ప్రభుత్వం ముందస్తు ధాన్యం కొనుగోళ్లకు అనుమతి ఇస్తే ఈనెల 11 నుంచే కొనుగోళ్లు ప్రారంభించే అవకాశం ఉంది. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి.. జిల్లా అధికారులు, మిల్లర్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వం చెప్పిన వెంటనే కొనుగోళ్లు ప్రారంభించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు అన్నీ సిద్ధం చేసి పెట్టుకున్నారు.

కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్..

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన దొడ్డు రకం ధాన్యాన్ని అమ్ముకునేందుకు అష్ట కష్టాలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం వల్ల ధాన్యం అమ్ముకునేందుకు మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. మొదట్లో రూ.2000లకు కొనుగోలు చేసిన మిల్లర్లు ఆంధ్రా నుంచి ధాన్యం వస్తుండడంతో కింటాకు రూ.1700లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు అధికారుల ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చారు.

గురుకులం ఎదుట పడిగాపులు



గురుకుల పాఠశాల ఎదుట పడిగాపులు కాస్తున్న తల్లిదండ్రులు



కిటికీలో నుంచి పిల్లలతో మాట్లాడుతున్న తల్లులు

- పాఠశాలలోకి తల్లిదండ్రులను అనుమతించని ఎస్‌ఓ
- గేటు ముందే భోజనాలు చేసి వెళ్లిన పేరెంట్స్

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం పడికాపులు కాసారు. పిల్లల్ని కలిసేందుకు స్పెషల్ ఆఫీసర్ (ఎస్‌ఓ) అనుమతి ఇవ్వలేదని.. వచ్చే ఆదివారం రావాలని అక్కడి వాచ్‌మెన్ చెప్పడంతో ఎండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పిల్లల కోసం తెచ్చిన ఆహారాన్ని తల్లిదండ్రులు గేటుముందే తిని మిగిలిన ఆహారాన్ని అక్కడే పడేశారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రతి 2వ ఆదివారం విద్యార్థులను చూడడానికి తల్లిదండ్రులకు అనుమతి ఇస్తారు. కానీ ఈ పాఠశాల ఎస్‌ఓ ఉద్దేశపూర్వకంగానే విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలోకి అనుమతించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఎస్‌ఓ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. అధికారులు గురుకుల పాఠశాలల ఎస్‌ఓ, ఉపాధ్యాయుల పనితీరు, మెరుగైన సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. కాగా.. పాఠశాలలోకి తల్లిదండ్రులను అనుమతించని విషయమై ఎస్‌ఓను విలేకరులు వివరణ కోరగా 'మీరు ఎవరైతే నాకేంటి నేను డ్రైవింగ్‌లో ఉన్నాను. కిందపడితే మీరు రెస్పాన్స్ అవుతారా' అని నిర్లక్ష్యపు సమాధానం చెప్పారు.

ఎస్‌ఓ అనుమతి ఇవ్వలేదు



ప్రతి నెల 2వ ఆదివారం పిల్లలను కలుసుకోవడానికి అనుమతి ఉంటుంది. కానీ ఈ రోజు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ అనుమతి ఇవ్వకపోవడంతో ఎండకు పడిగాపులు కాశాం. ఉన్నతాధికారులు స్పందించి ఎస్‌ఓపై చర్యలు తీసుకోవాలి.

– కృష్ణ యాచారం, హాలియా మండలం

విద్యార్థుల్లో ప్రశ్నించే సామర్థ్యం పెంచాలి

కోదాడ రూరల్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో ప్రశ్నించే సామర్థ్యాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్, రిటైర్డ్ ఐఏఎస్ చక్రపాణి అన్నారు. ఆదివారం కోదాడ పట్టణ పరిధిలోని తేజ విద్యాలయంలో ×సమకాలీన పాఠశాల విద్యలో మార్పులు–సమాజంపై ప్రభావం₹ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో వారు మాట్లాడారు. ప్రశ్నించే తత్వం పెరిగినప్పుడే సమాజంలో అవినీతి, అక్రమాలు తగ్గుతాయన్నారు. విద్యలో మానవీయకోణం అవసరమని, చదువుతో పాటు సమాజంపై అవగాహన కలిగే విధంగా పాఠాలు బోధించాలన్నారు. మానవ విలువలు, క్రమశిక్షణ లేని విద్య ఎంత ఉన్నా నిరుపయోగమేనని పేర్కొన్నారు. ప్రస్తుత చదువులు కేవలం డబ్బు సంపాదనే లక్ష్యంగా కొనసాగుతున్నాయని, అది సమాజానికి మంచిది కాదన్నారు. మహిళలను గౌరవించాలని, తోటి వారికి సహాయం చేయాలనే భావజాలం విద్యార్థుల్లో పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరగోపాల్

నర్రా రాఘవరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం



రాఘవరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, నాయకులు

నల్లగొండ టూటౌన్ : సుదీర్ఘకాలం శాసనసభ్యుడిగా పని చేసిన నర్రా రాఘవరెడ్డి రాజకీయ జీవితం స్ఫూర్తిదాయకమని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి వర్ధంతి సందర్భంగా నల్లగొండలోని ఎంవీఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నర్సిరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రజాప్రతినిధి అంటే నర్రా రాఘవరెడ్డి మాదిరిగా నిబద్ధత కలిగి ప్రజలతో మమేకమై.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన వారే ప్రజల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్లోరైడ్ విముక్త పోరాటంలో, ఎస్ఎల్‌బీసీ సొరంగం కోసం సాగిన పోరాటంలో నర్రా రాఘవరెడ్డి ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. అలాంటి అమరజీవి పేరుతో షుగర్, బీపీ, ఫిట్స్, పక్షవాతం రోగులకు మందులు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి, నాయకులు తుమ్మల వీరారెడ్డి, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, సయ్యద్ హాషం, ఎండీ.సలీం, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : పంచ నారసింహుడి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామున సుప్రభాతం, స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం నిర్వహించారు. అనంతరం నిజాభిషేకం, సహస్రనామార్చన గావించి తులసీ దళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు నిర్వహించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. ముఖ సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అఖండనామ ఆశ్రమంలో శని గాయత్రి హవనం

యాదగిరిగుట్ట : పట్టణంలోని ఆఖండ నామ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షయ సువర్ణ లక్ష్మీనారాయణ మహ యజ్ఞంలో భాగంగా ఆదివారం శని గాయత్రి హవనం పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభుజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేకువజామునే యాదాద్రి కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేపట్టారు. అనంతరం ఉదయం 6 గంటలకు ఆశ్రమంలో తులసీ, గోమాత, అశ్వదేవతా పూజలు, శృంగార హారతి నిర్వహించారు. శని అనుగ్రహం, కర్మ దోషాల నివారణ, పరిశ్రమలు విజయ అభివృద్ధి, మనోధైర్య సిద్ధి వంటివి చేకూరాలని శని గాయత్రి హవనం నిర్వహించినట్లు పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభుజీ తెలిపారు.



గాయత్రి హవనం నిర్వహిస్తున్న నిర్వాహకులు

● ఆనందోత్సాహాలతో ఈస్టర్



క్రీస్తు పునరుత్థానం (ఈస్టర్) సందర్భంగా ఆదివారం నల్లగొండలోని షాలోం వర్షిప్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న బిషప్ సుధీర్ కుమార్

రుణమాఫీ జాడేది?

- పూర్తిస్థాయిలో అమలుకు నోచని రూ.లక్షలోపు పంట రుణమాఫీ
- ఇప్పటి వరకు రూ.37వేల లోపు ఉన్న వారికే మాఫీ..
- బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించిన మంత్రి హరీశ్‌రావు
- మాఫీ ప్రక్రియపై నేటికీ ఊసెత్తని రాష్ట్ర ప్రభుత్వం



నల్లగొండ అగ్రికల్చర్ : ఎన్నికల ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన రూ.లక్షలోపు పంట రుణాల మాఫీ నేటికీ పూర్తిగా అమలుకు నోచుకోలేదు. 2018 డిసెంబర్ 31 వరకు ఉన్న రూ.లక్షలోపు రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని అప్పట్లో సీఎం కేసీఆర్ ప్రకటించారు. వాటి జాబితాను కూడా బ్యాంకర్ల నుంచి తెప్పించుకున్నారు. తొలుత మొదటి విడతలో రూ.25 వేల వరకు ఉన్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. ఆ తరువాత రెండో దశలో రూ.50 వేలలోపు పంట రుణాలు మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం గత సంవత్సరం ప్రకటించింది. కానీ కేవలం రూ.37 వేల వరకు ఉన్న రుణాలను మాత్రమే మాఫీ చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల బడ్జెట్‌లో రుణమాఫీకి నిధులు కేటాయిస్తున్నామని.. రూ.90 వేల వరకు ఉన్న పంటరుణాలను మాఫీ చేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రైతుల్లో రుణమాఫీపై ఆశలు రేకెత్తించాయి. కానీ నేటికీ రుణమాఫీకి సంబంధించిన ప్రక్రియపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అసలు ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందా లేదా అనే అనుమానాలను రుణ బాధితులు వ్యక్తం చేస్తున్నారు.

మాఫీ అవుతుందన్న ఆశతో..

ఎన్నికల ముందు కేసీఆర్ రుణమాఫీని చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో రైతులు తీసుకున్న రుణాలను బ్యాంకులకు చెల్లించలేదు. రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.30 వేల రుణాలను తీసుకున్న రైతులు కూడా తిరిగి చెల్లించలేదు. ప్రభుత్వం మాఫీ చేస్తుందన్న ధీమాతో రుణాలు చెల్లించడానికి వెనుకడుగు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేస్తుందని ఆశించిన రైతులు బంగపడాల్సిన పరిస్థితిలో ఉన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా బ్యాంకులకు రుణాలను చెల్లించకపోవడంతో వడ్డీపై వడ్డీ పడి రుణాలు రెండింతలయ్యాయి. వడ్డీ అయినా చెల్లించి రుణాలను రీషెడ్యూల్ చేసుకోమని బ్యాంకర్లు సూచించినప్పటికీ రైతులు పెడచెవిన పెట్టారు. రుణాలను తీసుకున్న సగం మంది రైతులు వాటిని రీషెడ్యూల్ కూడా చేయించుకోకపోవడంతో రుణాలు తడిసిమోపడయ్యాయి. ఒకవేళ ప్రభుత్వం రుణమాఫీ చేసినా 2018 డిసెంబర్‌లో తీసుకున్న గణాంకాల ప్రకారమే రుణమాఫీ చేస్తే అసలు పోయి వడ్డీ మీదపడే అవకాశం ఉంది.

బ్యాంకుల వైపు కన్నెత్తి చూడని రైతులు..

రుణమాఫీ అవుతుందన్న ధీమాలో ఉన్న రైతులు బ్యాంకుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. వడ్డీ కట్టమంటారన్న భయంతో అటు వైపు వెళ్లడం లేదు. పెట్టుబడుల కోసం తిరిగి రుణాలు తీసుకోవడానికి వెనకాడుతున్నారు. ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి అప్పు తెచ్చి పెట్టుబడులు పెడుతున్నారు.

గణాంకాలు లేవు..

పంట రుణమాఫీకి సంబంధించిన వివరాలు గానీ, గణాంకాలు గాని వ్యవసాయ శాఖ వద్ద, లీడ్ బ్యాంకు వద్దగానీ లేకపోవడం శోచనీయం. ఎంత మంది రైతులు రుణాలను తీసుకున్నారు.. రుణమాఫీకి అర్హులైన రైతులు ఎంత మంది, ఎన్ని కోట్ల రూపాయలు మాఫీ కానుంది.. ఎంత వరకు మాఫీ అయింది.. ఎంతమందికి కాలేదనే వివరాలేవీ లేకపోవడం గమనార్హం. లీడ్ బ్యాంకు, వ్యవసాయ శాఖ ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారే తప్ప అసలు లెక్కలు చెప్పడం లేదు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


నర్సయ్య (ఫైల్)

అడ్డగూడూరు: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందాడు. అడ్డగూడూరు మండలం డి.రేపాకలో ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముక్కమాల నర్సయ్య (50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, నర్సయ్య శనివారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా బోరు మోటారు స్టార్టర్ వద్ద రెండు చేతులు కాలిపోయి విగతజీవుడిగా పడి ఉండడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. సమాచారం మేరకు ఎస్ఐ ఉదయ్‌కిరణ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి


జానయ్యగౌడ్ మృతదేహం

మఠంపల్లి: తాటిచెట్టు పైనుంచి కిందపడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. మఠంపల్లి మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చౌటపల్లికి చెందిన ఐతగాని జానయ్యగౌడ్ (55) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీగా ఆదివారం మధ్యాహ్న సమయంలో గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారడంతో పైనుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జానయ్యగౌడ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు


గాయపడిన కిష్టయ్య

శాలిగౌరారం: తాటి చెట్టు పైనుంచి పడడంతో గీతకార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని వల్లాల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. వల్లాల గ్రామానికి చెందిన భూపతి కిష్టయ్య(65) కుల వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగా సాయంత్రం కల్లుగీసేందుకు తాటిచెట్టు ఎక్కిన కిష్టయ్య ప్రమదవశాత్తు జారి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

భార్యతో సఖ్యతగా మెలుగుతున్నాడని..

- అనుమానంతోనే వ్యక్తిపై కత్తితో దాడి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- పోలీసుల అదుపులో నిందితుడు?


కత్తిపోట్లతో గాయపడిన శంకర్

రామగిరి(నల్లగొండ): తన భార్యతో సఖ్యతగా మెలుగుతున్నాడని అనుమానం పెంచుకున్నాడు.. అదునుచూసి అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు.. మద్యం మత్తులో ఉండగా ఆ వ్యక్తి తారసపడడంతో గొడవకు దిగాడు. చుట్టు పక్కల వారు వారించడంతో వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత కత్తి తీసుకుని అతడి ఇంటికి వెళ్లాడు. గాఢ నిద్రలో ఉన్న అతడిపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. గాయపడిన అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి తర్వాత మృతిచెందాడు. ఇవీ.. తిప్పర్తి మండలం సర్వారంలో శనివారం చోటుచేసుకున్న హత్యోదంతం వెనుక ఉన్న కారణాలు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సర్వారం గ్రామానికి చెందిన చిర్రబోయిన శంకర్ (26) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన పాపకంటి మధుసూదన్, తన భార్యతో కలిసి కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. కొన్నేళ్ల క్రితం భవన నిర్మాణ కూలి పనులకు వెళ్లిన క్రమంలో శంకర్ తన భార్యతో సఖ్యతగా మెలుగుతున్నాడని మధుసూదన్ అనుమానించాడు. అప్పటి నుంచి అతడిపై కక్ష పెంచుకున్నాడు.

బెల్ట్‌షాప్‌లో తారసపడగా..

శనివారం మధ్యాహ్నం మధుసూదన్ గ్రామంలోని ఓ బెల్ట్‌షాప్‌లో మద్యం తాగుతున్నాడు. ఇదే సమయంలో శంకర్ కూడా అక్కడికి మద్యం తాగేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో శంకర్‌పై పగతో రగిలిపోతున్న మధు గొడవకు దిగాడు. ఇద్దరు తీవ్ర స్థాయిలో వాగ్వాదం చేసుకున్నారు. మద్యం మత్తులో ఉన్న మధు పక్కనే ఉన్న కూరగాలయ కత్తితో శంకర్‌పై దాడి చేయబోయగా స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు.

గాఢ నిద్రలో ఉండగా..

శంకర్ బెల్ట్‌షాప్ నుంచి ఇంటికి వెళ్లాక ఆవరణలోని మంచంపై నిద్రపోయాడు. అయితే, మద్యం మత్తులో ఉన్న మధుసూదన్ ఇంటికి వెళ్లి కొద్ది సేపటి తర్వాత కత్తి తీసుకుని శంకర్ ఇంటికి వెళ్లాడు. గాఢ నిద్రలో ఉన్న అతడిపై కత్తితో ఛాతి, వీపు వెనుక భాగంలో పలుమార్లు పొడిచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన శంకర్‌ను కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతిచెందాడు. ఆదివారం శంకర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హతుడి సోదరుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శాలిగౌరారం సీఐ రాఘవరావు, తిప్పర్తి ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాగా, నిందితుడు మధుసూదన్‌ను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే, ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు.



• పిచ్చుక దాహం తీరేనా..

రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండడంతో మనుషులతో పాటు జంతువులు, పక్షులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. తాగడానికి నీరు దొరక్క అల్లాడుతున్నాయి. భువనగిరి మండలంలోని బొల్లేపల్లి గ్రామంలో నీటి పైపు ద్వారా లీకవుతున్న నీటిని తాగుతూ పిచ్చుక దాహం తీర్చుకుంటుండగా సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి

నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి


లాంచీ దిగివస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. అక్కడ మ్యూజియంలోని అలనాటి నాగరికత విశేషాలు, బుద్ధుని ప్రతిమ, బుద్ధవనం తదితర వాటిని సందర్శించారు.

దిక్కుతోచని స్థితిలో 'ఐపీజీ' బాధితులు

- 'మునుగోడు' వ్యాప్తంగా 500 మంది వరకు యాప్‌లో పెట్టుబడులు
- వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులే ఎక్కువ
- 'సాక్షి' కథనంతో ఐపీజీ వాట్సాప్ గ్రూపు అడ్మిన్‌ల లెఫ్ట్
- పోలీసులకు ఫిర్యాదు చేసే యోచనలో పలివెల వాసులు

మునుగోడు: అధిక వడ్డీ వస్తుందనే ఆశతో తాము కూడబెట్టుకున్న నగదుతో పాటు బంగారు ఆభరణాలు కుదవపెట్టి ఐపీజీ(ఇంటర్ పబ్లిక్ గ్రూప్) రెంట్ యాప్‌లో పెట్టుబడిన బాధితులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. నిన్నటివరకు తాము పెట్టిన డబ్బులు తిరిగి వస్తాయనే ఆశతో ఎదురుచూస్తున్న బాధితులు మోసపోయామని తెలియడంతో ఏమి చేయాలో తెలియడం లేదని తమ సన్నిహితులతో చెప్పుకుంటున్నారు. ఐపీజీ రెంట్ యాప్ పేరుతో కోట్లు కొల్లగొట్టిన వైనాన్ని ఆదివారం 'సాక్షి' పత్రిక వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇది ఇలా ఉంటే ఆదివారం ఉదయం వరకు పనిచేసిన ఐపీజీ రెంట్‌కు సంబంధించిన వాట్సాప్ గ్రూపు సాక్షిలో వచ్చిన కథనం చూసిన మరుక్షణం నుంచే ఆ గ్రూపు అడ్మిన్‌లతో పాటు ప్రధాన పాత్రదారులు అంతా లెఫ్ట్ అయ్యారు. దీంతో అందులో పెట్టుబడి పెట్టిన ప్రతి ఒక్కరూ తమని మోసం చేసేందుకే నిర్వాహకులు యాప్ పెట్టి పెట్టుబడి పెట్టించారని, ఆ డబ్బులు ఎలా రికవరీ చేసుకోవాలని తమకు లింక్ ఇచ్చిన వ్యక్తుల వద్దకు వెళ్లి నిలదీస్తున్నారు.

వందల సంఖ్యలో బాధితులు..

మొదట మునుగోడు మండలంలోని పలివెల గ్రామంలోనే దాదపు 100మందికి పైగా బాధితులు ఉన్నట్లు తెలిసింది. కానీ సాక్షిలో కథనం ప్రచురించిన అనంతరం ఆ గ్రామంతో పాటు మండలంలోని ఊకొండి, సింగారం, మునుగోడు, చీకటిమామిడి, కొంపల్లి తదితర గ్రామాల్లో దాదాపు 500లకు పైగా బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో పెట్టుబడులు పెట్టిన వారు అంతా ప్రభుత్వ ఉద్యోగులు, చిట్టీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాళ్లతో పాటు ఇతర వ్యాపారులు ఉన్నట్లు తెలుస్తోంది. తాము మోసపోయామని మార్కెట్‌లో తెలిస్తే పరువు పోతుందని, వ్యాపారాలు కొనసాగే అవకాశం లేకుండా పోతుందనే భయంతో బయటికి చెప్పుకోలేకపోతున్నారు. పలివెల గ్రామంలోని బాధితులు మాత్రం మొదటి సారి తమ గ్రామానికి యాప్‌ని తీసుకొచ్చిన వ్యక్తి వద్దకు వెళ్లి తమ పరిస్థితి ఏమిటని నిలదీస్తే సోమవారం మూకుమ్మడిగా పోలీసులకు ఫిర్యాదు చేద్దామని చెప్పినట్లు తెలిసింది.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాజాపేట: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చల్లూరు గ్రామం శివారులోని వాగునుంచి శనివారం అర్ధరాత్రి ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోత్కూరు వాసికి సన్మానం


జ్ఞాపిక అందుకుంటున్న గుంషావలి

మోత్కూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లాలో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో మోత్కూరుకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, కవి ఎం.డి.గుంషావలి అత్యంత ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళా వేదిక చైర్మన్ కత్తి మండ ప్రతాప్, అంతర్జాతీయ గౌరవ అధ్యక్షులు చేజర్ల ఇంద్రకుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లస్‌గోల్ల శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. వృద్ధుడు దుర్మరణం

- మరో ముగ్గురు మహిళలకు గాయాలు

కేతేపల్లి: ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఓ వృద్ధుడు మృతిచెందగా మరో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. కేతేపల్లి మండలంలోని కొండకిందిగూడెం గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మాడ్గులపల్లి మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన కొమ్ము జానయ్య(80) భార్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె దశదిన కార్యక్రమాలు పూర్తి కావటంతో కేతేపల్లి మండలంలోని బండపాలెం గ్రామంలో గుట్టపై ఉన్న రామాలయంలో నిద్ర చేసేందుకు శనివారం రాత్రి జానయ్య తన కుటుంబ సభ్యులతో కలసి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో కొండకిందిగూడెం గ్రామం వద్దకు చేరుకోగానే డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయటంతో ఆటో అదుపుతప్పి మూడు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో జానయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న కొమ్ము కవిత, కొమ్ము కళ్యాణి, కొమ్ము భారతమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలు పది మంది వరకు ఉన్నట్లు తెలిసింది. గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మొదట నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలించారు. అయితే ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని కేతేపల్లి పోలీసులు తెలిపారు.

పైలాన్‌లో యువకుడిపై హత్యాయత్నం


చికిత్సపొందుతున్న మేదరి గోపాల్

నాగార్జునసాగర్: పందులను తరలిస్తుండగా అడ్డుకున్నాడనే ఆగ్రహంతో ఓ యువకుడు మరో యువకుడిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన నాగార్జునసాగర్‌లోని పైలాన్ కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పైలాన్‌కాలనీకి చెందిన మేదరి గోపాల్, కండల అజయ్ కుటుంబ సభ్యులు పందులను పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా రెండు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కాగా, అజయ్ ద్విచక్రవాహనంపై పందులను తరలిస్తుండగా గోపాల్ అవి నావంటూ అడ్డుకున్నాడు. దీంతో కోపోద్రిక్తుడైన అజయ్ పందులు కోసే కత్తితో గోపాల్‌ను పొడిచి పారిపోయాడు. గాయపడిన గోపాల్‌ను పోలీసులు స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

ఫ్లైఓవర్ పైనుంచి పడి వ్యక్తికి గాయాలు


గాయపడిన నర్సింహ

యాదగిరిగుట్ట: మద్యం మత్తులో ఫ్లై ఓవర్ పైనుంచి పడి వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదగిరిగుట్టలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూర్ మండలంలోని ముత్తిరెడ్డిగూడేనికి చెందిన ఓర్సు నర్సింహ ఆదివారం రాత్రి పట్టణంలోని తులసీ కాటేజీ సమీపంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న ఫ్లైఓవర్ ఎక్కాడు. అక్కడ నుంచి ప్రమాదవశాత్తు కిందపడడంతో గాయాలయ్యాయి. అతడిని 108వాహనంలో జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

ఐకేపీ సెంటర్లు ప్రారంభించాలి

భానుపురి(సూర్యాపేట): యాసంగి వరి ధాన్యం కొనుగోలుకు వెంటనే ఐకేపీ సెంటర్లు ప్రారంభించాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సూర్యాపేటలోని తెలంగాణ జనసమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగి వరి పొలాలు కోసిన రైతులు కల్లాల్లో ధాన్యాన్ని రాశులుగా పోసి ఐకేపీ సెంటర్ల ప్రారంభానికి ఎదురుచూస్తున్నారన్నారు. రోజురోజుకూ వాతావరణం మారుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి షరతులు లేకుండా రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో రైతు జన సమితి జిల్లా కోకన్వీనర్ అంగోతు సూర్యనారాయణ, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

కోదాడరూరల్: గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన కోదాడ పట్టణంలోని భవానీనగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. భవానీనగర్ కాలనీకి చెందిన టీచర్ మేకల సైదారావు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని గోపిరెడ్డినగర్‌లో ఉంటున్న తన అన్నయ్య ఇంటి వద్దకు వెళ్లారు. సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో ఇంటికి వచ్చి చూసే వరకు తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని బీరువాను తెరిచి రూ.లక్షన్నర విలువైన బంగారు, వెండి నగలు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సమాచారాన్ని సేకరించారు. బాధితుడు పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై వీధికుక్క దాడి

మునగాల: మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో శనివారం రాత్రి మహిళపై వీధి కుక్క దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. వివరాలు.. గ్రామానికి చెందిన జెక్కి లీలమ్మ శనివారం రాత్రి తన ఇంటిముందు కూర్చొని ఉండగా కుక్క అకస్మాత్తుగా వచ్చి మీదపడి గాయపర్చింది. బాధితురాలు కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు రాగా కుక్క పారిపోయింది. గాయపడిన లీలమ్మను ఆస్పత్రికి తరలించారు. పంచాయతీ పాలకవర్గం కుక్కల బెడదను అరికట్టాలని కోరుతున్నారు.

'మిర్యాల'లో హాథ్ సే హాథ్ జోడో యాత్రకు బ్రేక్

- నిలిచిన బీఎల్ఆర్ రెండో విడత పాదయాత్ర


దామరచర్ల మండలంలో జోడో యాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి జానారెడ్డి (ఫైల్)

మిర్యాలగూడ: భారత్ జోడోయాత్రలో భాగంగా తెలంగాణలో సైతం కాంగ్రెస్ పార్టీ అన్ని నియోజకవర్గాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్రలు చేపట్టాలని అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా సీనియర్ నేతలతో కమిటీలను ఏర్పాటు చేసి పాదయాత్రను కొన్ని చోట్ల ప్రారంభించారు. అందులో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గంలో కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ సైతం గత నెల 26న వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. దీనికి నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం బీఎల్ఆర్ చేపట్టిన పాదయాత్ర వేములపల్లి, మాడ్గులపల్లి మండలాల్లో సుమారు 152 కి.మీ ముగించుకుని మిర్యాలగూడకు చేరుకుంది. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి గ్రామాల్లో పర్యటించేందుకు ప్రణాళికను రూపొందించారు. ఈ క్రమంలోనే డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ సైతం మార్చి 28న దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల్లో పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్రకు ఏప్రిల్ 4న సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి సైతం హాజరై కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపారు. బీఎల్ఆర్ రెండవ విడత పాదయాత్ర ఈనెల 9న తడకమళ్ల గ్రామం నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరుతో బ్రేకులు పడ్డాయి.

బీఎల్ఆర్‌పై అధిష్టానానికి ఫిర్యాదు

పార్టీ వ్యతిరేకవర్గం తప్పుడు నివేదికతో బీఎల్ఆర్‌పై రాష్ట్ర స్థాయి నాయకులకు ఫిర్యాదు చేయడంతో అధిష్టానం పాదయాత్రను నిలుపుదల చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయంపై బీఎల్ఆర్ వర్గం జిల్లా సీనియర్ నాయకులను కలిసి ఆరా తీయగా నియోజకవర్గంలో అందరినీ కలుపుకుని పాదయాత్ర చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. పార్టీ పటిష్టతకు కృషిచేస్తున్న బీఎల్ఆర్ పాదయాత్రను అడ్డుకోవడం సరికాదని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ రాష్ట్ర నాయకత్వానికి సూచించినట్లు సమాచారం. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం తగిన సూచనలు ఇచ్చి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కార్యకర్తలు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీనరసింహుడి నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లిలో ఆదివారం లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజల తర్వాత మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణం తంతు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ, అర్చకులు పాల్గొన్నారు.

రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

గరిడేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, లేదంటే సీఎం కేసీఆర్‌ను ఫాంహౌజ్‌కే పరిమితం చేస్తామని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మలిదశ ఉద్యమంలో దివ్యాంగులు కూడా ప్రధాన భూమికను పోషించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో ఈదయ్య బాబు, రవీందర్‌నాయక్ ఉన్నారు.

మాగేస్తే ఎండుగడ్డిలోనూ పోషకాలు

- పాడి పశువులకు ఎంతో మేలు
- దిగుబడితోపాటు పెరగనున్న వెన్నశాతం
- గుర్రంపోడు పశువైద్యాధికారి అశోక్‌కుమార్


ఎండుగడ్డి వాము

గుర్రంపోడు: ప్రస్తుత పరిస్థితుల్లో పశుగ్రాసం కొరత కారణంగా పలువురు రైతులు ఎండుగడ్డిపై ఆధారపడుతున్నారు. ఎండిన వరిగడ్డిలో పచ్చిమేతలో లాగా పోషకాలు ఉండక పోవడంతో పశువులు బక్కచిక్కిపోతున్నాయి. ఎండిన వరిగడ్డిని పలు మెళకువలు పాటిస్తే పోషకాలు పెరిగి పచ్చిమేతగా మారుతుంది. ఎండుగడ్డిని పోషక విలువలున్న గ్రాసంగా మార్చుకునే విధానాన్ని మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్‌కుమార్ వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పశుపోషణకు రైతులు పచ్చిగడ్డితోపాటు ఎండుగడ్డిని కూడా అందిస్తుంటారు. సాధారణంగా వేసవిలో పచ్చిగడ్డి కొరత కారణంగా ఎండుగడ్డిని ఎక్కువగా వినియోగిస్తారు. ఎండుగడ్డితోపాటు జొన్న, మొక్కజొన్న, చొప్ప తదితర రకాలను కూడా ఎండబెట్టి దాణాగా వినియోగిస్తారు. వరికోతల అనంతరం రైతులు ఎండుగడ్డిని నిల్వ చేసి పశువులకు వేస్తారు. వాటికి కావాల్సిన మాంసకృత్తులు, ఖనిజ లవణాలు, విటమిన్లు ఎండుగడ్డిలో లభించవు. జీర్ణం కాని పీచు పదార్థమే వరిగడ్డిలో అధికంగా ఉంటుంది. అయితే ఎండుమేతలో కూడా నాణ్యతను పెంచుకుని పశువులకు దాణా వినియోగిస్తే అన్నికాలాల్లో పచ్చిమేతగా ఉపయోగించవచ్చు.

పాడి పంట

వరిగడ్డిని మాగేయడం ఇలా ..

పచ్చిమేత కొరత ఉన్న కాలంలో యూరియా ద్రావణంలో ఊరేస్తే ఈ మేతలో పోషక విలువలు పెరుగుతాయి. 60 లీటర్ల నీటిలో నాలుగు కిలోల యూరియాను కరిగించాలి. 100 కిలోల వరిగడ్డిని పొరలు, పొరలుగా వేస్తూ ప్రతి పొరపై నీళ్లు చిలకరించాలి. పొరల మధ్య గాలి ప్రవేశించకుండా తొక్కాలి. పెద్ద మొత్తంలో యూరియా గడ్డి తయారీకి వాము వేసి టార్పాలిన్‌ను కప్పాలి. 10 రోజుల తర్వాత తీసిచూస్తే, అమ్మోనియా వాసన కలిగి గోధుమరంగుకు మారిన మాగేసిన వరిగడ్డి పశువులు తినడానికి సిద్ధంగా ఉంటుంది.

ప్రయోజనాలు

యూరియా ద్రావణంలో మాగేసిన వరిగడ్డిని వాడటం వల్ల నాణ్యత పచ్చిగడ్డిమేతతో సమానంగా ఉంటుంది. జీర్ణమయ్యే మాంసకృత్తులు లేని వరిగడ్డిలో మాగవేయడం ద్వారా నాలుగు శాతం లభ్యమవుతాయి. యూరియాగడ్డి గోధుమ రంగులో ఉండి, అమ్మోనియా వాసన కలిగి, రుచికి తీయగా, మెత్తగా ఉండటం వల్ల ఇష్టంగా తింటాయి. గడ్డిలోని పోషక పదార్థాలు మూడు మాసాల వరకు నిల్వ ఉండి వినియోగమవుతాయి. వరిగడ్డిలో జీర్ణంకాని సెల్యులోజ్, హెమి సెల్యులోజ్ పీచుపదార్థాలు ఊరవేసిన తర్వాత సులభంగా జీర్ణమవుతాయి.

జాగ్రత్తలు

పశువులు యూరియా, అది కరిగిన నీళ్లను తాగకుండా జాగ్రత్తపడాలి. పొరల మధ్య గాలి ప్రవేశించకుండా తొక్కడం, తాళ్లతో బంధించడం చేయాలి. తమకున్న పశువుల సంఖ్య ఆధారంగా 3 మాసాలకు సరిపోయే వరిగడ్డిని మాగవేసుకుని, ఒక వాము వాడటం ప్రారంభించగానే మరొకటి తయారు చేసుకోవాలి.